# ౧ కారుణ్యం

ఒకప్పుడనుకునేవాణ్ణి నాకిక పెళ్లి కాదేమోనని. నాకోసరం కనీసం ఇరవైమంది పిల్లలనైనా చూసిఉంటారు మా నాన్నగారు. నాకు కాబోయే భార్యను "పాసు" చెయ్యవలిసినవారు మా బలగంలో చాలామంది ఉండేవారు. మా నాన్నగారు ఏ సంబంధం తెచ్చినా ఇంతమందిలోనూ ఎవరికో ఒకరికి ఏదోలోపం కనిపించితీరేది ఆసంబంధంలో. సంబంధాలు తీసుకురావటం మా నాన్నగారివంతు గనక తప్పులెన్నవలిసిన వారిలో ఆయన ఎన్నడూ లేరు. నేనుకూడా లేను. ఎందుకు లేనో నాకు చాలాకాలంవరకూ బోధపడకపోయింది. చివరకు నా సంశయం మా అమ్మగారు తీర్చింది.

"మొదలు మమ్మల్ని చూడనీ! ఇంకా నీదాకా రాందే!"

అనగా వారు కొట్టివెయ్యాని కేసులు నేను కొట్టివెయ్యటానికిగాని ఆమోదించటానికిగాని అధికారం ఉందేకాని, నాకై నేను ఏ కేసున్నూ ఆమోదించటానికి అధికారిని కానని.

నాకన్న మా నాన్నగారే ముందు తిరగబడ్డారు మా బలగంమీద.

"రాముడికి వీరభద్రరావుగారి అమ్మాయి ఖాయం!... ఇక నేనెవరి సలహాకూడా తీసుకోబోవటంలేదు," అన్నారాయన.

"తొందరపడకండి. ముందూ వెనకా ఆలోచించకుండా దిగితే తరవాత జన్మజన్మకీ భరించాలిసింది మనమే," అని మా అమ్మగారు అందుకుంది.

"రేపు తాంబూలాలు పుచ్చుకోబోతున్నాను!"

"ఈసంబంధంలో విశేషమేమిటి కాస్త చెప్పు, బావా?" అన్నాడు మా మేనమామగారు.

"విశేషం ఏమిటిరా? వీరభద్రరావుగారు రెండు వేలు కట్నం ఇస్తారు. అదే విశేషం!"

"అమ్మగో! నువ్వెప్పుడూ డబ్బు, డబ్బు అని అన్నీ పాడు సంబంధాలు తెస్తున్నావు. పెళ్ళి విషయమై నీకు కించిత్తయినా లోకజ్ఞానం—"

"ఓరి, పిచ్చివాడా! పిల్లదానిపేరు జానకి, మనవాడి పేరు రాముడు. అంతకన్న విశేషం ఏం కావాలి, బావా?" అని మానాన్నగారు ఉపాయంగా మా మేనమామను వదిలించుకున్నారు.

తీరా తాంబూలాలు పుచ్చుకుని ముహూర్తం కూడా ఏర్పాటు చేసుకున్న తరవాత మాబలగం ఆసంబంధంలో పెద్దలోపం కనిపెట్టగలిగింది. వీరభద్రరావుగారికి ద్వితీయ కళత్రం. ఆమె కఠినస్వభావురాలనీ పరుషంగా మాట్లాడుతుందనీ చెప్పుకుంటారట. నాకు ఆవిడ సవతిఅత్తగారు అవుతుంది కనక నన్ను సరిగా చూడదేమోనని మావాళ్ళభయం!

నాకు ఒకటేభయం—ఆ జానకి అందగత్తె కాదేమోనని. పిల్లది అందంగా ఉంటుందా అని అడగటం నాకు నామోషీ. నేను కురూపిని అని లోకం అభిప్రాయపడ్డ తరవాత నాకు అందగత్తెను తెచ్చి ముడిపెట్టాలని ఎవరికేమంత యావ ఉంటుంది?

జానకి అసామాన్య సౌందర్యవతి అనేవిషయం మా నాన్నగారు బయటపెట్టలేదు. ఆపని మరెవరోచేశారు — నేను ఫలానివారిపిల్లనుచేసుకోబోతున్నానని తెలిసి, "ఆపిల్లా? ఆపిల్ల చాలాఅందంగాఉంటుందే!" అన్నారు, ఆపిల్లను నేను పెళ్ళాడటానికి అదొక పెద్దఅంతరాయమల్లే!

నా అనాకారితనంతో పోల్చి ఆపెద్దమనిషి నా కాబోయే భార్యను అందగత్తె అని ఉంటాడు, సామాన్యపు సౌందర్యమైనా ఉండకబోతుందా అనుకున్నాను. కాని జానకి నాకళ్ళపడగానే నాకు చాలాకష్టంవేసింది. అందరికీ ఉన్నంత స్వార్థం నాకూఉంది. అయితే న్యాయబుద్ధి అనేదికూడా నాకు భగవంతుడు ప్రసాదించాడు. అంతచక్కని పిల్లనుతెచ్చి నాకు అంటగట్టటం చాలాఅన్యాయం. నాకంతఆశ ఎన్నడూలేదు. నాకు కాబోయే భార్య ఏమాత్రం సంసారపక్షంగాఉన్నా నేను తృప్తిపడి ఉండేవాణ్ణే!

జానకిని చూసి మావాళ్ళంతా తృప్తిపడ్డారు. ఆమెకు నేను తగిన భర్తనేనా అనేమాట మావాళ్ళకెవరికీ తట్టలేదు.

సహజంగా పెళ్ళికూతురివైపు వచ్చినవారందరికీ తట్టిన అంశమే అదీ! నన్నుచూసి వారంతా అసహ్యించుకున్నారు. ఆ అసహ్యాన్ని దాచాలనికూడా వారెటువంటి ప్రయత్నమూ చేయలేదు; నావంక వారంతా అసహ్యంగా చూసేవారు, నాకువినిపించేటట్టు అసహ్యమైన మాటలనేవారు.

"మావీరభద్రుడికి ఇంతమతిలేదని నేనెన్నడూ అనుకోలేదు!" అని ఒకపెద్దమనిషి నావంకే చూస్తూ అన్నాడు.

నా ప్రాణం చివుక్కుమంది. నన్ను నేను లోకువ చేసుకోవ టమూ మరొకరు నన్ను లోకువ చెయ్యటమూ ఎన్నడైనా ఒకటి అవుతవా?

జానకి పినతల్లి కొడుకు, కాళిదాసనే అతను నాకు నావివాహం మొదటిరోజునించీ స్నేహితుడైనాడు. అతనికి నామీద అభిమానంకూడా ఏర్పడ్డదని చెప్పగలను. లేకపోతే అతను, నన్నుగురించి ఎవరెవరు ఏమేమి అనుకుంటున్నారో, అవన్నీ పూసగుచ్చినట్టు చెప్పిఉండడు. కాని అతని అభి మానం నాప్రాణంమీదికి వచ్చింది. అతని మాటలు నాకు బల్లెపుపోటల్లే అయేవి.

"నన్ను కనికరించి ఇక ఈకబుర్లు మానేస్తూ!" అని అతనితో అందామని ఎన్నోసార్లు నాకు నాలికచివరదాకా వచ్చింది. కాని అనలేకపోయినాను. ఈబాధకు అలవాటైపోకపోతానా అనుకుని మాట్లాడకుండా ఊరుకున్నాను.

ఆ ఎడారిలో జలప్రదేశంలాగా కనపడ్డది మా సవతి అత్తగారు కమలమ్మ. ఆమెకు ముప్పైలోబడ్డ వయస్సుం టుంది. పెద్దఅందగత్తెకాదు కాని కళగలమొహం. చూడగానే గంభీరస్వభావురాలనిపించింది. కాని నాతో ఆమె చాలా ప్రేమపూర్వకంగా మాట్లాడేది. నా అనాకారితనం గమనిం చని మనిషి ఆమె ఒక్కతే అనుకున్నాను.

ఆమాటే నేను కాళిదాసుతో అంటే అతను వికటంగా నవ్వి, "నువ్వు బాగుండవని విని ఆవిడ ఈసంబంధం కాకుండా చెయ్యటానికి ఎంతప్రయత్నంచేసిందో తెలుసా?" అన్నాడు.

నేను ఆశ్చర్యపడి, "అయితే మరి మా అత్తగారిప్పుడు నన్నింత బాగా చూస్తూ ఉండటానికి కారణం ఏమిటీ ? ఆమెను చూస్తే నాకుప్రాణం లేచివచ్చినట్లవుతుంది!" అన్నాను.

కాళిదాసు రహస్యంగా నాచెవిలో "పిచ్చివాడా, ఎవత్తెకైనా సవతికూతురు మీద ప్రేమ ఉంటుందిటోయ్? జానకికి అనాకారి మొగుడువస్తే కమలమ్మకు సంతోషం కాదూ? " అన్నాడు.

అతని వాదనలో పొరపాటు నేను వెంటనే పట్టేశాను. "అయితే మొదట్లో నన్ను వడగొట్టాలని ఎందుకుచూసింది?"

ఆప్రశ్న వెయ్యటం నాదే బుద్ధితక్కువ. కాళిదాసు లోతులేని మనిషి. అతనికి మెదడు తక్కువని నేను గ్రహించి ఉండవలిసింది. ఆకాస్త మెదడునూ నా అమాయకపు ప్రశ్నతో కెలికి ఉంటాను. ఆకాస్త మెదడూ బురదలేచి కెలుకులైన నీటిమాదిరిగా అయిపోయింది. అతను కాస్సేపు కంగారుతో ఏదో అర్థంలేని మాటలు మాట్లాడి, చివరకు నా మీద కోపం తెచ్చుకున్నాడు నేనేమో పెద్ద అపకారం చేసినట్టు. మరి కాస్సేపటికి అతను నాదగ్గిర్నుంచి లేచి అవతలికి వెళ్ళిపోయినాడు. ఆకాస్తనీరు మళ్ళీ తేరుకోగానే తిరిగి వస్తాడులె మ్మనుకున్నాను.

ఇది జరిగినప్పటినుంచీ కమలమ్మగారు నా మనస్సులో నా ఆలోచనల్లో, ఒకస్థానం ఏర్పరుచుకుంది. ఆమెను అర్థం చేసుకోవాలని నాకు అభిలాష జాస్తి అయింది.

పెళ్ళి నాలుగోనాడు రాత్రి బూజంబంతి అయిన తరవాత ఊరేగింపు ఏర్పాటుచేసుకున్నారు. నేనూ మావధువూ

వచ్చి పల్లకీలో కూర్చున్నాం. పల్లకీ ఎత్తారు. కమలమ్మగారు నాదగ్గిరకు వచ్చి నా బుగ్గన పెట్టిన కాటుకబొట్టు— కొంచెం చెదిరింది కాబోలు—సరిచేస్తున్నది. వెనకఉన్నవారిలో ఎవరో నవ్వారు. ఆవిడ నవ్వగానే మరొకరు నవ్వారు బలవంతాన ఆపుకోవాలని ప్రయత్నం చేస్తూనే. మరొక క్షణంలో ఆనవ్వు యెట్లా ప్రారంభమయిందో అట్లాగే చప్పున మాయమైంది.

నా ఒళ్ళు మండిపోయింది. ఈ ముసుకులో గుద్దులాట ఎన్నాళ్ళు? నేనంత అసహ్యంగా ఉంటానని తోస్తే నా మొహాన అనెయ్యరాదూ? నాఅంతట నేను గ్రహించుకునేట్టు ఈసూచన లెందుకూ?

నేను మామత్తగారివంక చూశాను. ఆమె నావంకే చూస్తున్నది. ఆమె మొహంలో, పాపం, రక్తంలేదు. నేను తన వంక చూడగానే ఆమె మొహం తిప్పుకుని వెళ్ళిపోయింది.

ఊరేగింపు సాగబోతుండగా ఆమె మళ్ళీ మాదగ్గిరికి వచ్చింది. ఆమె మొహంలో మార్పు నాకు కొంచెం ఉపశాంతి కలగజేసింది. ఆవిడ నేరుగా జానకిదగ్గిరికి వచ్చి, "నువ్వెందుకు తలవంచుకుంటావే, పిల్లా?" అని జానకి తలకాయ బలవంతాన పైకి ఎత్తి, నాతో "చూశావా, నాయనా? మా పిల్లనుచూసి నువ్వు తలవంచుకోరాదూ?" ... అద్దం తీసుకురానా?" అన్నది నవ్వుతూ.

ఆవిడ మాటలకు నా హృదయం పొంగి పొర్లసాగింది. నాకు కలిగిన ఆనందం చెప్పలేను.

"ఎందుకండీ ? మీపిల్ల మొహం అద్దం మాదిరిగా ఎదట ఉంటే వేరే అద్దాలెందుకూ?" అన్నాను.

మాసంభాషణ ముత్తయిదువులంతా వినే ఉంటారు. ఆ తరవాత వారు నావంక మృగాన్ని చూసినట్టు చూడటం మానారని రూఢిగా చెప్పగలను.

కారుణ్యం అనేది ఎట్లా ఉంటుందో నాకు మా అత్త గారు అప్పుడు తెలియజేసింది. నావివాహం అయిన సంవత్సరం లోపుగానే ఆమెను ఎవరూ అర్థం చేసుకోలేక పోయినారని నేను గ్రహించాను.

జానకిని నాకివ్వకుండా ఉండాలని ఆవిడ ప్రయత్నం చేసినమాట నిజమే. అదికూడా ఆమెకు నాభార్యమీదగల దయచేతనే. వివాహం జరిగి తీరుతుంది అని తోచిన తరవాత ఆమె చేసిన ప్రయత్నం యావత్తూ నేను కళ్లార చూశాను.

కాపరానికి వచ్చిన తరవాత మాజానకి నన్ను ఎట్లా చూస్తే సుఖపడుతుందో మా అత్తగారు జానకి ఎదట నన్ను అట్లా చూసేది—జానకి కాపరానికి రాకపూర్వం నేను వారింటికి వెళ్ళినప్పుడల్లా.

నేను రాగానే ఆమె ఎంతో గౌరవంగా లేచి నిలబడేది. నేను వింటూండగా ఆమె బిగ్గరిగా మాట్లాడేదికాదు. మరొకర్ని బిగ్గరిగా మాట్లాడనిచ్చేదికాదు. నన్ను "ఏమండీ" అని పిలవటంకూడా ప్రారంభించింది.

ఆవిడ దయవల్ల నేనూ నాభార్యా ఈనాటికీ ఎంతో సుఖంగా కాపరం చేస్తూన్నాం. నాభార్య నన్ను సుఖపెట్టి

నట్టు అందరు భార్యలూ తమ తమ భర్తలను సుఖపెట్టగలిగితే ప్రపంచం స్వర్గంగా మారిపోను.

కాని జానకి ఎన్నడూ, తనసవతితల్లిని తలపకపోవటం నాకు చాలా ఆశ్చర్యకరంగా ఉండేది. నాలంతట నేను ఆవిడ విషయం తెస్తే జానకి నావంక ఒకరకంగా చూసి మాట్లాడకుండా ఊరుకునేది. నేనుమాత్రం ఆవిడవిషయం ఎత్తటం మానలేదు.

అకస్మాత్తుగా నా భార్య ఒకసారి, "ఇదివరకల్లా ఆవిడే మీామీాద కన్నువేసి దనుకునేదాన్ని, మీారుకూడా—" అని ఆగింది.

నాప్రాణం చివుక్కుమంది.

"జానకీ, నీకుకూడా ఆవిడ అర్థంకాలేదా?......ఆవిడ మీాద నీకు ఆపేక్ష లేదా?" అన్నాను.

"సవితితల్లికీ సవితికూతురికీ ఎక్కడన్నా ఆపేక్ష ఉంటుందా?"

"సవితితల్లి అనేనా? ఆవిడ నీమీాద ఏమైనా అసూయ చూపేదనా?"

"ఆవిడకు అసూయ లేదనా? ఉన్నప్పుడు సరిగా ఉన్నా మధ్యమధ్య ఆవిడ చాలా మోటుగా మాట్లాడుతుంది. ఆవిడది ఎట్లాఅయినా కఠినహృదయం. మనపెళ్ళిలో ఊరేగింపులో చూడండి మిమ్మల్ని ఎట్లాఎగతాళిచేసిందో! మానాన్నకు కూడా తెలుసు. అందుకనే ఆయన నన్ను ఎప్పుడూ ఒక కంట కనిపెట్టే ఉండేవాడు."

మానవ ప్రకృతి చాలా విచిత్రమైనది. కమలమ్మను అర్థంచేసుకున్నవాణ్ణి నేనొక్కణ్ణేనని నాకు తోచిపోగానే నాలో ఒక విధమైన వికారం ప్రారంభమైంది. ఆమెను నేను వెర్రిగా ప్రేమించసాగాను. నాకు జానకినెందుకు భగవంతుడు భార్యగా చేశాడూ? నాకు కావలసిన మనిషి కమలమ్మ!

ఈ ప్రణయ బీజం మనస్సులో నాటుకున్న తరవాత అది పెరిగి పెద్దదై చిలవలూ, పలవలూ వేసి మనస్సంతా ఆక్రమించుకుని ఎంతగందరగోళమైనా చేసింది. కొద్ది రోజుల్లోనే నాకు అవిడధ్యాసమే అయిపోయింది. చివరకు నేనామె కోసరం నిద్రాహారాలుకూడా సరిగా లేనివాణ్ణయిపోయి విరహం అనుభవించసాగాను.

కొద్దిరోజుల్లోనే, నేనూ, మాజానకీ మా అత్తవారింటికి వెళ్ళవలిసి వచ్చింది ఏదో పండుగ కారణంగా. కమలమ్మను చూడగానే నేను ఉన్మత్తుణ్ణి అయిపోయినాను. ఆమెతో ఒంటిరిగా అయిదు నిమిషాలు మాట్లాడగలిగితే! నా ప్రేమను— నాసార్థకమైన ప్రేమను — ఆమె ఎట్లా తృణీకరిస్తుంది? ఆమె నన్ను తిరిగి ప్రేమించగలిగితే ప్రపంచం ఏమయితేనేం ?

నేను జ్వరితుణ్ణయి ఎదురు చూస్తున్న అవకాశం ఒకనాడు ఎట్లాగో లభించింది. నేను తడబడుతున్న మాటలతో నాహృదయం ఆమెముందు విప్పి పెట్టాను. ఆమె హృదయం నేనెంత బాగా అర్థం చేసుకున్నానో ఆమెకు తెలియజేశాను. ఆమె కారుణ్యాన్ని గురించి కూడా ఒక ముక్క అన్నాను.

ఆమె తాపీగా నా మాటలన్నీ ఆలకించి, "నా కారుణ్యం నీకు సరిగా అర్థమైనట్లు లేదు. మీ మామగారిని పిలిచి నీ గోడవ ఆయనకు చెప్పిన తరవాత నా కారుణ్యం నీకు చక్కగా అర్థం అవుతుంది!" అని ఆమె చరాచరా వెళ్ళిపోయింది.

"ఏమండోయ్!" అని ఆవిడ మా మామగార్ని కేక వెయ్యటం నా చెవుల బడ్డ పిడుగల్లే.

నా జ్వరం ఒక్క దెబ్బతో మాయమయింది. నా శరీరం చలవలు కమ్మింది. నేను నా భార్య విషయం కూడా ఆలోచించకుండా వెంటనే ఆ యిల్లు వదలిపెట్టి రైలెక్కాను.

ఇంతకూ మా అత్తగారు భర్తతో నామీద ఏమీ చెప్పలేదని తెలిపోయింది. కాని నా మనస్సును ఒకప్పుడు ఆవరించిన విషవృక్షం తాలూకు సన్నని వేరైనా అక్కడ లేదని నేను లోకానికి మనవి చేస్తున్నాను.

## ౨ జైలుఖానా

వెనక అంతా సముద్రమే. ఎక్కడా భూమి లేదు. ఆ రోజుల్లో మనుష్యులు ఆ సముద్రపు అలలమీద తేలి ఆడుకుంటూ ఉండేవాళ్ళు. వాళ్ళకప్పుడు ఆకాశంలోకి ఎగిరే శక్తి కూడా ఉండేదనుకుంటాను. కాలక్రమాన బుద్ధి పరిపక్వంఅయి ఆ అలలమీద ఊగటమూ, ఆ సముద్రంలో ఈదటమూ